క్లుప్తంగా

ఆకట్టుకున్న కోలాటం


స్వామి సన్నిధిలో కోలాటం ఆడుతున్న మహిళలు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శనివారం ఏర్పాటు చేసిన కళారాధన కార్యక్రమం భక్తులను అలరించింది. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు, చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి స్వామి సన్నిధిలో భక్తి గీతాలకు కోలాటం ఆడారు. సుమారు రెండు గంటల పాటు నిర్విరామంగా నృత్యాలు చేసి అలరించారు. శనివారం కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శనానికి తరలి వచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్

విజయనగరం ఫోర్ట్: పేదలకు చేయూతనివ్వడంలో సంతృప్తి ఉందని మారుతీ స్వయం సహాయక సంఘం అధ్యక్షుడు గుత్తురు చంద్రశేఖర్ అన్నారు. స్థానిక కణపాక అగురవీధిలో శనివారం 50 మంది పేదలకు నిత్యావసర వస్తువులను సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలన్నారు. వారి పట్ల చిరాకు పడకూడదని అన్నారు. కార్యక్రమంలో నాగరాజు, తులసీరామ్, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


విజయనగరం-శ్రీకాకుళం ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా ఒరిగి ఉన్న ప్రచార ఫ్లెక్సీ

విజయనగరం: నగరంలో ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్న ప్రచార ఫ్లెక్సీలతో ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులకు అత్యంత సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు ఇటీవల వీచిన ఈదురుగాలులకు నేలకొరిగినా వాటిని తొలగించకపోవడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వారంతా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. నగర శివారులోని సింగపూర్‌సిటీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ప్రమాదకరంగా మారింది. ఏదైనా ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి దాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆటవిడుపు


స్విమ్మింగ్ పూల్‌లో ఈతకొడుతున్న విద్యార్థులు

శృంగవరపుకోట: స్థానిక కేంబ్రిడ్జ్ నారాయణ, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన వేసవి బ్యాడ్మింటన్ శిక్షణా శిబిరాల ముగింపు సందర్భంగా క్రీడాకారులు అందరిలో ఆటవిడుపుగా చీఫ్‌కోచ్ పి.శ్రీరాములు ఉల్లాసం నింపారు. రెండు శిబిరాల్లో క్రీడాకారులు అందరినీ శనివారం ఎస్.కోట పట్టణంలోని శిరికి రిసార్ట్స్‌కు తీసుకెళ్లారు. క్రీడలు, వ్యాయామం ఎంత అవసరమో వివరించారు. మనిషికి వ్యాయామం, ఆటలతో పాటూ అదే స్థాయిలో ఆరోగ్యాన్ని ఇచ్చేది ఈత అని తెలియచెప్పి, క్రీడాకారులతో ఈతకొలనులో స్విమ్మింగ్ చేయించారు. అనంతరం క్రీడాకారులు అంతా చీఫ్‌కోచ్ శ్రీరాములుకు ధన్యవాదాలు చెప్పి, మళ్లీ తమ స్కూళ్లకు వెళ్లిపోతామని, వచ్చే ఏడాది సమ్మర్ క్యాంప్‌కు వస్తామంటూ వీడ్కోలు చెప్పారు.

వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోండి

చీపురుపల్లి: ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలల్లో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని స్థానిక జీబీఆర్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.విజయలక్ష్మి కోరారు. ఈ మేరకు శనివారం ఆమె ప్రకటన విడుదల చేశారు. ఈనెల 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. చీపురుపల్లి ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఎలక్ట్రికల్, మెకానికల్ కోర్సులు ఉన్నాయని, ప్రవేశాలకు విద్యార్థులు ముందుకు రావాలని కోరారు. స్థానిక కళాశాలలో నూతన భవనాలు, ల్యాబ్ సదుపాయం, నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నట్లు స్పష్టం చేశారు. గతేడాది ఇదే కళాశాల నుంచి కోర్సులు పూర్తి చేసుకుని రిలీవ్ అయిన 78 మంది చక్కని ఉద్యోగ అవకాశాలు పొందారని తెలిపారు. విద్యార్థులు చీపురుపల్లి కళాశాలను వెబ్ ఆప్షన్‌లో నమోదు చేసుకుని చక్కని భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని పేర్కొన్నారు.

దివ్యాంగులకు బంగారు 'భవిత'

- చురుగ్గా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల గుర్తింపు సర్వే
- విద్యతో పాటు ఫిజియో, స్పీచ్ థెరపీ సేవలు
- వారిలో ఆత్మవిశ్వాసం నింపేలా విద్యాశాఖ చర్యలు


దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వే చేపడుతున్న సమగ్రశిక్ష, విద్యాశాఖ సిబ్బంది

పూసపాటిరేగ: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్లో ఆత్మవిశ్వాసం నింపి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలనే లక్ష్యంతో భవిత కేంద్రాలు సేవలందిస్తున్నాయి. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కేంద్రాల్లో పిల్లలకు విద్యతో పాటు ఫిజియోథెరపీ, ఇతర సేవలను అందిస్తున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా వారి శారీరక, మానసిక ఎదుగుదలకు భవిత కేంద్రాలు బాటలు వేస్తున్నాయి. ఇతర పిల్లలతో వారిని వేరుచేసి చూడకుండా అందరినీ ఒకే పాఠశాలలో చేర్పించి విద్యనందిస్తున్నారు. ఇందులో భాగంగా సమీప భవిత కేంద్రాలతో ప్రాథమిక పాఠశాలలను అనుసంధానించారు. సాధారణ పిల్లలతో పాటు కలిసి చదువుకోవడం ద్వారా దివ్యాంగులమనే భావాన్ని వారి మనసులోనుంచి తొలగించి వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపాలన్నదే విద్యాశాఖ ఆలోచన.

విద్యతో పాటు ఫిజియోథెరపీ..

మాటలు రాని, మానసిక ఎదుగుదల లేని పిల్లలు, ఇళ్లలో ఉండి మరంత మానసికంగా కుంగిపోకుండా, వారిని గుర్తించి భవిత కేంద్రాల ద్వారా విద్యను అందించేలా సమగ్రశిక్ష అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సాధారణ పిల్లలతో కలిసి బోధన జరిగేలా మండలానికి ఒక పాఠశాలను ఎంపిక చేశారు. అక్కడ ఐఈఆర్‌టీలు వారికి విద్యాబోధన అందిస్తారు. అక్కడే మధ్యాహ్న భోజనం, విద్యాకానుక కిట్లు వంటి సౌకర్యాలు కల్పిస్తారు. ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీ, యోగా తదితర వాటిలో శిక్షణ ఇస్తారు. ఐఈఆర్‌టీలు ఫిజియోథెరపిస్ట్‌ల పర్యవేక్షణలో పనిచేయాల్సి ఉంటుంది. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు పాఠశాలలో చేరితే ప్రతి నెలా రూ.300లు రవాణా ఛార్జీలుగా ఇస్తారు. వినికిడి లోపం, దృష్టిలోపం, ఉన్న వారికి ట్యాబ్‌లతో పాటు తొమ్మిది, పదోతరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనం, ఏడాదికి రూ.9 వేలు నుంచి రూ.11 వేలు వరకు అందజేస్తారు. వైకల్యం శాతం అధికంగా ఉంటే చదవలేరని ధ్రువపత్రంతో పింఛన్ అందిస్తారు. బస్సు రైల్వేలో పాస్ సౌకర్యంతో పాటు పాఠశాలకు రాలేని వారికి ఇంటింటికి వెళ్లి బోధిస్తారు. ఇలాంటి వారు పాఠశాలకు రాకున్నా వచ్చినట్లే హాజరు వేస్తారు. ప్రత్యేక శిక్షణతో వారిని ఆయా తరగతులు ఉత్తీర్ణులు అయ్యేలా చేసి, ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖ కృషిచేస్తోంది.

సద్వినియోగం చేసుకోవాలి

దివ్యాంగులు బడిబాట పట్టేలా సర్వే ముమ్మరం చేశాం. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు విద్యను బోధిస్తూనే వారిలో సామర్థ్యాలను పెంచేందుకు వివిధ రకాల కృత్యాలు చేయించడం, ఫిజియోథెరపీ అందించడం వంటివి చేస్తున్నాం. వారికి లైఫ్ స్కిల్స్ నేర్పించి సాధారణ పిల్లలకు ఏమాత్రం తీసిపోని విధంగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు సద్వినియోగం చేసుకోవాలి.

– బి.పాపినాయుడు, ఎంఈఓ, పూసపాటిరేగ

ఆశాజనకంగా నువ్వుసాగు


కుమిలి సమీపంలో సాగుచేస్తున్న నువ్వుపంట

పూసపాటిరేగ: మండలంలో ప్రస్తుత సీజనులో సాగుచేస్తున్న నువ్వుపంట ఆశాజనకంగా ఉంది. మండలంలో సుమారు 300 ఎకరాల్లో నువ్వుపంట సాగులో ఉంది. కుమిలి, రెల్లివలస, చల్లవానితోట, మలకాం, లక్ష్మీదేవితోట, వెంపడాం, పేరాపురం, పతివాడతో పాటు పలు గ్రామాల్లో రైతులు నువ్వుపంట సాగుచేస్తున్నారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో కురిసిన వర్షాలు ఈ పంటకు మేలు చేశాయని రైతులు అంటున్నారు.

చిరస్మరణీయుడు సుబ్రహ్మణ్య తిలక్


తిలక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

విజయనగరం: స్వాతంత్ర సమరయోధుడు, భారత మొదటి పార్లమెంటేరియన్ కందాళ సుబ్రహ్మణ్య తిలక్ చిరస్మరణీయుడని సీనియర్ న్యాయవాది ఫ్రొఫెసర్.ఎస్.రాజు అన్నారు. పట్టణంలోని ఉడా కాలనీలో ఉన్న తిలక్ ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం తిలక్ ఐదో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఫౌండేషన్ ప్రతినిధులు సుబ్రమణ్య తిలక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు ఫ్రొఫెసర్. ఎస్.రాజు మాట్లాడుతూ తిలక్ అభ్యుదయ భావాలు కలిగిన వారని, ఆయన బ్రాహ్మణుడైనప్పటికీ దళిత సంక్షేమానికి, దళిత విద్యార్థుల చదువులకు ప్రాధాన్యత ఇచ్చి తన సొంత ధనాన్ని ఖర్చు చేశారని గుర్తుచేశారు. దళిత యువత ఉన్నత చదువులు, ఉన్నత ఉద్యోగాల సముపార్జనకు ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. కుల వ్యవస్థ నిర్మూలనకు పని చేసిన మొదటి వ్యక్తి తిలక్ అని కొనియాడార. సోషలిస్ట్ భావాలు కలిగిన తిలక్‌ను నేటి సమాజం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తిలక్ ఫౌండేషన్ కార్యదర్శి గురుస్వామి కందాళ సాయిబాబా, వాకర్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ కొత్తలి ఎర్రినాయుడు, సీతారామచంద్ర వర్మ, కే.వి.రామకృష్ణ, కొల్లి సత్యం, కందాళ ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి


సత్యప్రసాద్‌ను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, అధ్యాపకులు

- బీఎస్ఎన్ఎల్ డీజీఎం ఎం.సత్యప్రసాద్

భోగాపురం: మండలంలోని చెరుకుపల్లి అంవతి ఇంజినీరింగ్ కళాశాలలో వైర్డు యాక్సెస్ నెట్వర్క్(ఆప్టికల్ ఫైబర్ కమ్యూనికేషన్), కస్టమర్ ప్రెమిసెస్ పరికరాలపై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. విశాఖపట్నం బీఎస్ఎన్ఎల్ డీజీఎం ఎం.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో భాగంగా వైర్డు యాక్సెస్ నెట్‌వర్క్(డబ్ల్యూఏఎన్) పరికరాల పనితీరుపై బీఎస్ఎన్ఎల్ సంస్థలో పనిచేస్తున్న పలువురు నిపుణులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం బీఎస్ఎన్ఎల్ డీజీఎం సత్యప్రసాద్ మాట్లాడుతూ.. నైపుణ్యాభివృద్ధిలో బీఎస్ఎన్ఎల్ ఇంక్యుబేషన్ సెంటర్ కీలకపాత్ర పోషించిందని చెప్పారు. 5జీ సాంకేతికతకు ఫైబర్ ఆప్టికల్ కమ్యూనికేషన్ ఎలా ఉపయోగపడుతుందో విద్యార్థులకు వివరించారు. విద్యావేత్తలు, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు ఇటువంటి వర్క్‌షాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పరిశ్రమల డిమాండ్‌కు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, విభాగాధిపతి శివభాస్కర్, తదితరులు సత్యప్రసాద్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫణి మాధవికి కవితా పురస్కారం

విజయనగరం టౌన్: ఖమ్మంకి చెందిన ఫణి మాధవి కన్నోజుకు డాక్టర్ రాధేయ కవితా పురస్కార ప్రదానోత్సవం గురజాడ కేంద్ర గ్రంథాలయం ఆవరణలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు సాహితీ స్రవంతి జిల్లాశాఖ ప్రతినిధి చీకటి దివాకర్ శనివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గంటేడ గౌరునాయుడు, ఆత్మీయ అతిథులుగా అట్టాడ అప్పలనాయుడు, బండి సత్యనారాయణ, అవార్డు వ్యవస్థాపకులు డాక్టర్ సుంకర గోపాల్, పెళ్లూరు సునీల్, దోర్నాదుల సిద్ధార్థలు హాజరుకానున్నారన్నారు. సాహితీ మిత్రులందరూ హాజరుకావాలని కోరారు.

వాహన తనిఖీలు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురంలో శనివారం సాయంత్రం పెదమానాపురం ఎస్ఐ శిరీష, పోలీసులు వాహన తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లా డుతూ వాహన పత్రాలతో పాటు వాహన చోదకులకు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానిపై చర్యలు తీసుకుంటామని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

గూడెం సొసైటీ చైర్మన్ రాజీనామా

గుర్ల: మండలంలోని గూడెం పీఏసీఎస్ చైర్మన్ రెడ్డి మురళీధరరావు తన పదవికి శనివారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని సొసైటీ సీఈఓ వర్మకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి తనవంతు కృషి చేశానన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సొసైటీ నుంచి సహకారం అందించామని తెలిపారు.

13న కామాక్షమ్మ ఆలయ వార్షికోత్సవం


ఆలయ వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయనగరం: పట్టణంలోని బొండాడవీధిలో ఉన్న మహాగణపతి, కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామివారి ఆలయ పంచమ వార్షికోత్సవాన్ని జ్యేష్ఠ శుద్ధ సప్తమి సందర్భంగా గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ పాలకమండలి అధ్యక్షుడు అప్పలబత్తుల సోమరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 13న ఉదయం 6 గంటల నుంచి స్వామివారికి, అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అలంకరణ, కలశస్థాపన, అర్చన, భూపుర శ్రీచక్ర అలంకరణ, దేవి దేవతా మూర్తుల ఆవాహణం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 9 గంటలకు మూలమూర్తులకు ప్రత్యేక వస్త్రాభరణాల అలంకరణ, 10 గంటలకు సువాసినిలతో శ్రీచక్ర సహస్ర కుంకుమార్చన, లలితా పారాయణం నిర్వహిస్తామన్నారు. హరే శ్రీనివాస్ బృందం వారిచే సాయంత్రం కోలాట కార్యక్రమము, 6 గంటలకు కామాక్షి దేవి ఏకాంబరేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా చేపట్టనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ లక్కోజు ఓంకార్ ఆచార్య సిద్ధాంతి తెలిపారు. అలాగే అమ్మవారిని 108 చీరలతో అలంకరించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వార్షికోత్సవ కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

విద్యారంగం నుంచి కార్పొరేట్ శక్తులను వెల్లగొట్టాలి


మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక జిల్లా కన్వీనర్ జోగినాయుడు


విజయనగరం అర్బన్: పేదలకు విద్యను అందుబాటులో ఉంచేందుకు కార్పొరేట్ శక్తులను విద్యారంగం నుంచి వెల్లగొట్టాలని మానవ హక్కుల వేదిక, భారత నాస్తిక సమాజం జిల్లా కమిటీ సంయుక్తంగా డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘాల జిల్లా కన్వీనర్ బంకురు జోగినాయుడు శనివారం స్థానిక అమర్ భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. విద్య, వైద్య రంగాలను పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే నిర్వహించాలని, ఈ రంగాల్లోని ప్రైవేటు, కార్పొరేట్ శక్తుల నుంచి రక్షించే విధంగా నూతన ప్రభుత్వం చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. నూతన విద్యావిధానం వల్ల మధ్యయుగం నాటి కుల వృత్తులను పరోక్షంగా పిల్లలపై పడుతోందని పేర్కొన్నారు. సీబీఎస్ఈ సిలబస్‌ను రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం బలవంతంగా రుద్దుతోందని ఆరోపించారు. డిగ్రీ విద్యలో తీసుకొస్తున్న సంస్కరణలు యువతకు ప్రయోజనం చేకూరేలా లేవన్నారు. మరోవైపు ప్రభుత్వం మొత్తం విద్యారంగాన్నే ప్రైవేటీకరకు బాటలు వేస్తోందని విమర్శించారు. మూఢనమ్మకాల నిర్మూలనకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించి, అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆహ్లాదం.. ఆనందం

విజయనగరం జిల్లా కేంద్రం మునుపెన్నడూ లేనంతగా గత ఐదేళ్లలో అభివృద్ధి చెందింది. కూడళ్లన్నీ చరిత్రకు సాక్ష్యాలుగా ఆధునిక సొబగులు అద్దుకోగా.. చెరువు గట్లన్నీ సుందర ప్రదేశాలుగా రూపుదిద్దుకున్నాయి. ఆహ్లాదాన్ని పంచేలా పార్కులు ముస్తాబయ్యాయి. విజయనగరం వాసులను ఆకర్షిస్తున్నాయి. పర్యాటక ప్రేమికుల మనసు దోచుకుంటున్నాయి. వారి నోటి వెంట ఐ లవ్ విజయనగరం అన్న మాట పలికిస్తున్నాయి. ఇది.. మన విజయనగరం అని చెప్పుకుని గర్వపడేలా శోభాయమానంగా కనిపిస్తున్నాయి. విజయనగం వాసులు సేదతీరేందుకు అనువుగా మారాయి. దీనికి అచంట గార్డెన్ నిలువెత్తు నిదర్శనం.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం


పార్కులో పర్యాటకుల సందడి


నిండు కుండలా పెద్దచెరువు



విద్యుత్ వెలుగుల్లో అచంట గార్డెన్ ముఖద్వారం



ఆకట్టుకుంటున్న 'ఐ లవ్ విజయనగరం'



బుద్ధుడి విగ్రహం


ఉయ్యాల ఊగుతూ..


స్మైల్ ప్లీజ్ ..

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్


మాట్లాడుతున్న ప్రముఖులు

చీపురుపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆర్యసమాజం దయానంద వేదిక గురుకుల నిర్వాహకులు ముద్దు రాధాకృష్ణ అన్నారు. పట్టణంలోని కొత్తఅగ్రహారంలో గల ఆర్యసమాజంలో నిర్వహించిన యోగశిబిరం శనివారంతో ముగిసింది. ఈసందర్భంగా వంద మందితో ఆర్యసమాజంలో గాయత్రీ హోమం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత చెడు అలవాట్లు, వ్యవసనాల జోలికి వెళ్లి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. చిన్న వయస్సు నుంచే క్రమశిక్షణ ఎంతో అవసరమని చెప్పారు. ప్రతి ఒక్కరూ నైతిక విలువలను పాటించాలన్నారు.రోజూ ప్రాణాయామం చేయడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. చెడు అలవాట్లు జోలికి పోబోమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. యోగ శిబిరానికి హాజరైన వారికి నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనకా పల్లి సమీపంలో 4వ తరగతి నుంచి పదో తరగతి వరకు నూతనంగా గురుకులం ఏర్పాటు చేశారని, ఆ పాఠశాలకు విద్యార్థులను పంపించాలని సూచించారు. బిస్వారాజాన ఆర్య, రామముని, భోజరాజు, కుమరాపు అప్పలనాయుడు, ఐ.సత్యనారాయణ, దన్నాన సత్యనారాయణ, దన్నాన శంకరరావు, ఐ.రమణ తదితరులు పాల్గొన్నారు.